వికారాబాద్‌లో ఫుడ్ ఫెస్టివల్

విజేతలకు బహుమతులు అందజేస్తున్న సేల్స్ ఆఫీసర్ కవిత

వికారాబాద్, డిసెంబర్ 1 : గ్యాస్ లీకైతే 1906 కాల్ చేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ జిల్లా సేల్స్ ఆఫీసర్ కవిత తెలిపారు. ఆదివారం వికారాబాద్‌లో 'మన వంట గది మన ఇంటి భద్రత' కార్యక్రమంలో భాగంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వంటల పోటీ నిర్వహించారు. పోటీలో గెలుపొందినవారికి కవిత బహుమతులు అందజేశారు.

ఆధునిక విద్యా విధానాలపై సదస్సు

బంజారాహిల్స్, డిసెంబర్ 1 : మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యాధునిక విద్యావిధానాలతో పాఠశాలలను ఎలా సిద్ధం చేయాలనే అంశంపై 'హైదరాబాద్ సహోదయ స్కూల్స్ కాంప్లెక్స్'(హెచ్ఎస్ఎస్సీ) ఆధ్వర్యంలో 'సమన్వయ-2024' పేరుతో జాతీయ సదస్సును బంజారాహిల్స్‌లో నిర్వహించారు. రాష్ట్రంలోని 281 సీబీఎస్ఈ స్కూళ్లకు చెందిన ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్న ఈ సదస్సులో సరికొత్త విద్యావిధానాలు, మారుతున్న పరిస్థితులు తదితర అంశాలపై చర్చించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన యునెస్కోకు చెందిన నేషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సరితా జాదవ్ మాట్లాడుతూ.. గ్లోబల్ ఎడ్యుకేషన్ విధానానికి అనుగుణంగా విద్యాబోధనను మార్చుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ముంబై ఐఐటీ ప్రొ.అజంతా సేన్, ఐఐఎం అహ్మదాబాద్ ప్రొ.కాథన్ దుష్యంత్ శుక్లా, హెచ్ఎస్ఎస్సీ చైర్మన్ అమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

వికారాబాద్, డిసెంబర్ 1 : జిల్లాస్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని సంకల్ప్ విద్యా పీఠం పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి శ్రీలతారెడ్డి, గీతా ప్రచార ప్రముఖ్ రాములు వ్యవహరించారు. ఈ పోటీలలో జిల్లాలోని పాఠశాలలకు సంబంధించిన పలువురు విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శించారు.

అంతర్జాతీయ సేవారత్న అవార్డుకు రఘునాథ్‌యాదవ్ ఎంపిక

అవార్డుకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 1 : బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అందించే అంతర్జాతీయ సేవారత్న అవార్డుకు తాను ఎంపికైనట్లు షాద్‌నగర్‌కు చెందిన అఖిలభారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌యాదవ్ తెలిపారు. అవార్డుకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గౌతం ఆదివారం అందజేశారన్నారు. ఈ నెల 15న ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు. సమాజంలో నిస్వార్థంగా చేస్తున్న సేవా కార్యక్రమాలకుగాను ఈ అవార్డుకు ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా రఘునాథ్‌యాదవ్‌ను యాదవ సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, కృష్ణ, దేవేందర్‌యాదవ్, వెంకటేశ్‌యాదవ్, బాల్‌రాజు, మల్లేశ్‌యాదవ్, జంగయ్య, రవీందర్ పాల్గొన్నారు.

కొండాపూర్‌లో డ్రగ్స్ పట్టివేత

శేరిలింగంపల్లి, నవంబర్ 1: కొండాపూర్‌లోని ఓ హోటల్ రూంలో ఎండీఎంఏ డ్రగ్స్‌ను సైబరాబాద్ ఎస్ఓటీ, గచ్చిబౌలి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు డ్రగ్స్ పెడ్లర్లతో పాటు మరో ఇద్దరు వినియోగదారులను అరెస్టుచేసి.. వారి వద్ద నుంచి రూ.4,18, 600 విలువచేసే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాదాపూర్ డీసీపీ వినీత్ కేసు వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం మద్దెలపాలెంకు చెందిన గులిపాళ్లి గంగాధర్ స్టాక్ మార్కెటింగ్ చేస్తుంటాడు. ఒడిశాకు చెందిన డాన్స్‌మాస్టర్ కన్హా మహంతి నగరానికి వచ్చి పటేల్ నగర్, మూసాపేట్‌లో నివసిస్తున్నాడు. వారిద్దరు స్నేహితులు. వారు బెంగళూర్ నుంచి నగరానికి ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకు వచ్చి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం కొండాపూర్‌లోని కన్హా బోటిక్ హోటల్ 303 నంబర్ గదిలో గంగాధర్, కన్హ మహంతితో పాటు గంజాయిని కొనుగోలు చేసేందుకు మాదాపూర్‌లోని ఓ హాస్టల్‌లో నివసించే ఇద్దరు యువతులు వచ్చారు. దీనిపై సమాచారం అందుకున్న సైబరాబాద్ ఎస్ఓటీ, గచ్చిబౌలి పోలీసులు దాడిచేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 18 గ్రాములు ఎండీఎంఏ, 1 గ్రాము ఓజీ కుష్, 7 గ్రాములు ఇండియన్ చెర్రాస్, 1 ఎల్ఎస్‌డీ పేపర్ డ్రగ్స్‌తో పాటు 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

కిష్టయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 1 : తెలంగాణ ఉద్యమంలో కానిస్టేబుల్ కిష్టయ్య పాత్ర వెలకట్టలేనిదని ముదిరాజ్ సంఘం జిల్లా మహాసభ అధ్యక్షుడు భైరమోని మల్లేశ్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం శంషాబాద్ పట్టణంలో తెలంగాణ మలిదశ ఉద్యమంలో సెల్‌టవర్ ఎక్కి ఆత్మబలిదానం చేసుకొని అమరుడైన కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి సంస్మరణ సభను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మల్లేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కానిస్టేబుల్ కిష్టయ్య పాత్ర వెలకట్టలేనిదని గుర్తు చేశారు. కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మెరుగు సురేశ్ ముదిరాజ్, టౌన్ అధ్యక్షుడు మనోజ్‌ముదిరాజ్, బొబ్బిలి కిష్టయ్య, జిల్ల శ్రీనివాస్, సిద్ధేశ్వర్‌ముదిరాజ్, మహేందర్‌ముదిరాజ్, జిల్ల ఆనంద్, బొబ్బిలి శేఖర్, రాములు ముదిరాజ్, సిద్ధు, హన్ముంతు, నాగం గిరి, మల్లేశ్, కృష్ణ పాల్గొన్నారు.

వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

పరిగిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

పరిగి, డిసెంబర్ 1 : బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై మంత్రులు కొండా సురేఖ, సీతక్క చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకొని, క్షమాపణలు చెప్పాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు మంచన్‌పల్లి ఆనంద్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు లాజర్ డిమాండ్ చేశారు. మంత్రులు చేసిన వ్యాఖ్యలను వారు ఖండిస్తూ ఆదివారం పరిగిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురుకులాల కార్యదర్శిగా పనిచేసిన ప్రవీణ్‌కుమార్ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా కృషి చేయడంతోపాటు పూర్ణ, ఆనంద్‌లు ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించేలా చేసిన ఉన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. అలాంటి వ్యక్తిపై చిల్లర మాటలు మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. ఆర్ఎస్ నేతృత్వంలోని బృందం గురుకులాలను సందర్శిస్తామంటే అంత భయమెందుకని వారు ప్రశ్నించారు. మంత్రులు వెంటనే క్షమాపణలు చెప్పాలని, లేకపోతే తెలంగాణ సమాజం, విద్యార్థులు, ఉద్యమకారులు, స్వేరో నాయకులు మిమ్మల్ని బయట తిరగనివ్వబోరని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, ఉద్యమ నాయకుడు సింగం పాల్గొన్నారు.

ముగిసిన జాతర

- చివరి రోజు బుగ్గ రామలింగేశ్వరస్వామి ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయ పరిసర ప్రాంతాలు
- జాతరలో ఇప్పటివరకు సుమారు 3 లక్షల మంది పుణ్యస్నానాలు

మంచాల, డిసెంబర్ 1 : బుగ్గ రామలింగేశ్వరస్వామి జాతర నేటితో ముగిసింది. చివరి రోజు ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు జనసందోహంగా మారాయి. బుగ్గ క్షేత్రంలో ఉన్న గుండంలో కుటుంబసమేతంగా స్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు ఆలయ ఆవరణలో కార్తిక దీపాలను వెలిగించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవాదాయ శాఖ, మంచాల మండల పరిషత్, ఆరుట్ల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు ఏర్పాట్లు చేశారు.

జన సందోహంగా బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణ

ఉత్సవాలకు రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, హైదరాబాద్ జిల్లాల నుంచి సుమారు 3 లక్షల మంది పుణ్య స్నానాలు ఆచరించినట్లు దేవాదాయ శాఖ కమిటీ సభ్యులు తెలిపారు. మంచాల సీఐ మధు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూశారు. వైద్యశాఖ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. మంచాల ఎంపీడీవో బాలశంకర్ ఆధ్వర్యంలో 20 మంది సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించారు. ఇబ్రహీంపట్నం నుంచి ఆలయం వరకు భక్తుల సౌకర్యార్థం 10 నిమిషాలకో బస్సును ఆర్టీసీ నడిపింది.

జాతరకు తరలివస్తున్న భక్తులు

శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

ఆలయ ఆవరణలో సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టాలి

317 బాధితుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్

ఆమనగల్లులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న 317 బాధిత ఉపాధ్యాయులు

ఆమనగల్లు, డిసెంబర్ 1 : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థానికత ఆధారంగా బదీలీలు చేపట్టాలని, అందుకు సంబంధించిన జీవో విడుదల చేసి ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని 317 బాధితుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిషత్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట 317 బాధితులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సబ్ కమిటీ నివేదికలో స్థానికత అనే అంశం లేకపోవడం సరైన విధానం కాదని, సబ్ కమిటీ సిఫార్సుల ఆధారంగా కమిటీకి సంబంధం లేని స్పౌజ్, మ్యూచువల్, మెడికల్‌కు సంబంధించిన జీవో విడుదల చేయడాన్ని ఖండిస్తూ రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు నిరసన చేపట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా బాధ్యుడు శ్రీనివాస్, కార్యదర్శి అలివేలు, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్.కె. మిశ్రోకు చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారం

విలేకరుల సమావేశంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి చిత్రంలో తదితరులు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 1: ప్రఖ్యాత రంగస్థల, టీవీ, చలనచిత్ర నటుడు, దర్శకుడు ఎస్.కె. మిశ్రో నాటకరంగానికి చేసిన కృషికి గాను చాట్ల శ్రీరాములు పేరిట నెలకొల్పిన ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, రసరంజని అధ్యక్షుడు డాక్టర్ కె.వి. రమణాచారి వెల్లడించారు. రెడ్‌హిల్స్‌లోని రమణాచారి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. రసరంజని, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్టు ఆధ్వర్యంలో చాట్ల శ్రీరాములు 93వ జయంతి వేడుకలు పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో డిసెంబర్ 5న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాటకరంగమే తపస్సుగా భావించిన చాట్ల శ్రీరాములు నిత్య కృశీవలుడని, ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకుని నాటకరంగ కళాకారులకు మార్గదర్శకంగా నిలిచారని గుర్తు చేశారు. చాట్ల శ్రీరాములు సంకల్పం మేరకు 1999నుంచి ప్రతి ఏటా నాటక రంగ విశిష్టునికి రూ.20వేల నగదుతో సత్కరించే సంప్రదాయం కొనసాగుతుందని అన్నారు. ఈ సంవత్సరం ఎస్.కె మిశ్రోను ఈ అవార్డుకు కమిటీ సభ్యులు ఎంపిక చేశారని ఈ నెల 5న పురస్కారాన్ని ప్రధానం చేసి ఘనంగా సత్కరించనున్నట్లు వివరించారు. సమాజంలోని సమస్యలకు అద్దంపట్టే అంశాలతో యువభేరి థియేటర్ నిర్వహణలో నా శత్రువు నాటికను ఈ సందర్భంగా పలువురు నటీనటులు వేదికపై ప్రదర్శిస్తారని రసరంజని కార్యదర్శి కేతి నీడి నటరాజు తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు రామకోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు అరుణ్‌కుమార్, నారాయణ స్వామి పాల్గొన్నారు.



అయ్యప్ప మెట్టు మహాపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

అయ్యప్ప కృప ప్రజలపై ఉండాలి

కందుకూరు, డిసెంబర్ 1 : అయ్యప్ప కృప ప్రజలపై ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరుకున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని రాచులూరులో బేతు రాఘవేందర్ రెడ్డి గురుస్వామి 18వ మెట్టు మహాపూజ బ్రహ్మ శ్రీ కుట్టన్ చంద్రమోహన్ గురుస్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి, గురుస్వాములు, కుమార్, సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బేతు రాంరెడ్డి, తాళ్ల కార్తీక్, నాగేశ్వర్‌రెడ్డి, బొక్క దీక్షిత్‌రెడ్డి, మద్ది అఖిల్‌రెడ్డి, కిరణ్ , బీఆర్ఎస్ పార్టీ నాయకులు అరవింద్ శర్మ, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 1 : మహిళ అదృశ్యమైన ఘటన ఆదివారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం..ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన కుమారస్వామి అతడి భార్య మౌనిక, ఇద్దరు పిల్లలలో శంషాబాద్ పట్టణంలోని వెల్లంకి నగర్‌లో ఉంటున్నారు. కుమారస్వామి రోజువారి కూలీ కాగా.. భార్య మాత్రం ఇంట్లో ఉంటుంది. గత శుక్రవారం(రెండురోజులు)క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఇద్దరు పిల్లలను వదిలి ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చిన భర్తకు భార్య కనిపించక పోవడంతో చుట్టుపక్కల వెతికాడు. ఆచూకీ తెలియక పోవడంతో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

బండ్లగూడ / మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 1: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ తెలిపారు. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నం.134, శివరాంపల్లి 258, మొయినాబాద్ వద్ద ప్రమాద స్థలాలను గుర్తించి రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్‌తో కలిసి సందర్శించారు. ప్ర మాదాలను అధిగమించడానికి, ట్రాఫిక్ సమస్యలను నిరోధించాలని సిబ్బందికి సూచించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు వాహనాలను అతివేగంగా నడపడం వల్ల ప్రమాదాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయన్నారు. వీటి కారణంగా అనేక మంది తమ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, కార్లల్లో సీట్ బెల్ట్ తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు ప్రమాద స్థలాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో సూచిక బోర్డులతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

అత్తాపూర్ వద్ద పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ ఎదుట ఆందోళన చేస్తున్న మాలమహానాడు నేతలు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆందోళన

రవీంద్రభారత్, డిసెంబర్ 1: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు నేతలు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ ఎదురుగా ఆదివారం ఆందోళన చేశారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ వీఎల్ రాజు, జేఎన్‌రావు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మాలల ఉద్యమాన్ని పక్కదారి పట్టించడానికి కాంగ్రెస్ మాల ఎమ్మెల్యేల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మాలలను అణిచివేయడానికి కాంగ్రెస్, బీజేపీలు పూనుకున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా జాతీయ అధ్యక్షురాలు సీహెచ్ రోజ లీలా, ఆర్ల రమేశ్, నక్క దేవేందర్‌రావు, పద్మ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు హేమలత తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రి సందర్శన

కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రిని సందర్శించిన అమెరికన్ కాలేజ్ ఆఫ్ నర్స్ మిడ్ వైవ్స్ ప్రతిధుల బృందం

బేగంపేట, డిసెంబర్ 1: అమెరికన్ కాలేజ్ ఆఫ్ నర్స్-మిడ్ వైవ్స్ ప్రతినిధుల బృందం ఆదివారం బేగంపేట లోని కిమ్స్-సన్ షైన్ హాస్పిటల్స్‌ను సందర్శించారు. వైద్య రంగంలో అవలంభిస్తున్న చికిత్స పద్ధతులు, ఆధునిక టెక్నాలజీతో కూడిన ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ఉపయోగిస్తున్న వైద్య సదుపాయాలు చికిత్స విధానాలు అడిగి తెలుసుకున్నారు. అమెరికన్ కాలేజ్ నర్స్ మిడ్‌వైవ్స్ డెలిగేషన్ ప్రతినిధి డాక్టర్ కేథరీన్ కాలిన్స్-పులియాతో పాటు ప్రతినిధి బృందానికి కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధాకర్ జాదవ్, ఆసుపత్రి నర్సింగ్ సూపరిండెంట్ షైనీ చేరియన్‌తో కలిసి చర్చించారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందజేస్తున్న కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రిని సందర్శించిన ఆధునిక వైద్య సేవల చికిత్స విధానాలను తెలుసుకోవడం తమకెంతో ఉపయోగపడుతుందని అమెరికన్ కాలేజ్ ఆఫ్ నర్స్-మిడ్ వైవ్స్ ప్రతినిధుల బృందం డాక్టర్ కేథరీన్ కాల్సిన్స్-పులియా తెలిపారు.

కరాటే పోటీల్లో సత్తాచాటిన బిలహరి

మియాపూర్ , డిసెంబరు 1 : హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీకి చెందిన విద్యార్థి బిలహరి దక్షిణాఫ్రికా దర్బన్‌లో నవంబరు 29, 30 వ తేదీన జరిగిన కామన్ వెల్త్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో అండర్ 11 విభాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు చిన్నారులు పోటీ పడగా బిలహరి సత్తా చాటింది.

ముగిసిన శంభు కింకిణి నృత్యోత్సవాలు

కొండాపూర్, డిసెంబర్ 1: మాదాపూర్‌లోని శిల్పారామంలో రెండు రోజులుగా కొనసాగుతున్న 'శంభు కింకిణి' నృత్యోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. నాట్య గురువులు పద్మ కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యోత్సవాలలో పలువురు నృత్యకారుల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ముగింపు వేడుకల్లో భాగంగా అక్షత మానే సత్రియా నృత్యం, సుధా తమోతిరాం ఒడిస్సీ నృత్యం, చైతన్య కుసుమ ప్రియా భరతనాట్య నృత్య ప్రదర్శన, దేబశిష్ పేరిణి నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమానికి యోగ థెరపిస్ట్ హిమబిందు, తెలుగు యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వనజ ఉదయ్ తదితరులు హాజరై ప్రదర్శనలను తిలకించారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

హయత్‌నగర్, డిసెంబర్ 1 : కళాశాలకు వెళ్లిన ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేటకు చెందిన భాస్కర్ పెద్దకుమారుడు విష్ణు(17), హయత్‌నగర్‌లో ఉన్న వర్డ్ అండ్ డీడ్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. శనివారం ఉదయం 8 గంటలకు కళాశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన విష్ణు సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద, కళాశాలకు వెళ్లి కుమారుడి ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.